ప్రజాశక్తి
గురువారం 8 జూన్ 2023 5 విజయనగరం

9న విద్యుత్తు వాహన మేళా

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 9న జిల్లా పరిషత్ ప్రాంగణంలో గో ఎలక్ట్రిక్ - గో గ్రీన్ పేరుతో విద్యుత్ వాహన మేళా నిర్వహించనున్నట్లు నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ ఎం.వి.కె. రాజు తెలిపారు. ఆరోజు ఉదయం 11గంటలకు జెడ్‌పి ఛైర్మన్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల చేతుల మీదుగా మేళా ప్రారంభమై సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. మేళాలో వివిధ రకాల ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రదర్శనలో ఉంచుతామని, వినియోగదారులకు లైవ్ డెమో అవకాశం కూడా కల్పిస్తామని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల సౌకర్యార్థం ఈ మేళాను నిర్వహిస్తున్నామని, వారికి ఇఎంఐ సదుపాయంతోపాటు వాహనాలను నిర్ణీత ధరకే అందజేస్తామని వెల్లడించారు. పర్యావరణాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడేందుకు, ఇంధన వనరులను పొదుపు చేసేందుకు, విద్యుత్ వాహనాల ఆవశ్యకతను తెలియజేసేందుకు ఈ మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

బుడా ప్లాట్లు.. కొనేవారెవరు?

- జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కి ఆదరణ కరువు
- ప్లాట్ల రిజిష్ట్రేషన్‌కి నిబంధనల గుదిబండ
- ప్రారంభించి రెండు నెలలైనా 15 మందే దరఖాస్తు
- మొగ్గుచూపని చిరుద్యోగులు, వ్యాపారులు

ప్రజాశక్తి-సాలూరు

అత్యంత ఆడంబరంగా ప్రారంభించిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కి ఆదరణ కరువైంది. బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రెండు లేఅవుట్లపైనా కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. ప్లాట్ల విక్రయాలు ప్రారంభించి రెండు నెలలైనా 15 మందే దరఖాస్తు చేసుకోవడం అందుకు నిదర్శనం. రిజిస్ట్రేషన్‌కు నిబంధనలు గుదిబండగా మారడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం కారణంగా చెప్పొచ్చు.

పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న సంకల్పంతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లకు శ్రీకారం చుట్టింది. మధ్యతరగతి ఉద్యోగులకు, వ్యాపారులకు అందుబాటులో ఉండే విధంగా ప్లాట్ల అమ్మకాలు చేపట్టాలని నిర్ణయించింది. పట్టణానికి సమీపంలో బైపాస్ రోడ్డుకు ఆనుకుని బుడా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణ కనిపించడం లేదు. ప్లాట్ల అమ్మకాల ప్రక్రియ ప్రారంభించి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు కనీసం 20శాతం మంది కూడా రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. పట్టణ ప్రాంతంలో బుడా సంస్థ 14.87 ఎకరాల్లో రెండు లేఅవు ట్లకు రూపకల్పన చేసింది. 29 మంది రైతుల నుంచి రూ.2.88 కోట్లతో భూమి కొనుగోలు చేసి ప్లాట్ల అమ్మకాలకు రంగం సిద్ధం చేసింది. డిప్యూటీ సిఎం రాజన్నదొర చేతుల మీదుగా లేఅవుట్లలో ప్లాట్ల అమ్మకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే వెబ్‌సైట్‌ని ప్రారంభించారు. 150, 200, 240 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాట్లను వర్గీకరణ చేశారు. జాతీయరహదారి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో చదరపు గజం రేటు రూ.5వేలు, దుగ్ధసాగరం లేఅవుట్‌లో రూ.4,800గా బుడా నిర్ణయించింది. ప్రయివేటు రియల్ ఎస్టేట్ లేఅవుట్లతో పోలిస్తే బుడాసంస్థ రూపొందించిన లేఅవుట్లలో ప్లాట్ల ధరలు బాగా తక్కువే. కానీ ప్రజలు ముందుకు రావడం లేదు.

నిబంధనల గుదిబండ

రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత కొనుగోలు దారులు కొన్ని ధ్రువపత్రాలతోపాటు పది శాతం సొమ్ము చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆదాయం రూ.18 లక్షల లోపు ఉంటుందని ఫారం-16ని సమర్పించాలి.అదే వ్యాపారులైతే రూ.18 లక్షల లోపు ఆదాయం ఉంటుందని రెవెన్యూ అధికారితో ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఇది చిరువ్యాపారులకు కొంతగుదిబండగా ఉంది.

మౌలిక సదుపాయాలేవీ

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లలో ఇంతవరకు బుడా సంస్థ మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు చేపట్టలేదు. లేఅవుట్‌లో సౌకర్యాల కల్పనకు ఇంకా శ్రీకారం చుట్టలేదు. ప్రయివేటు లేఅవుట్లలో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, పార్కు వంటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ బుడా లేఅవుట్లలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

వెంటాడుతున్న టిడ్కో గృహాల నీడ

టిడిపి ప్రభుత్వ హయాంలో సామాన్య, మధ్యతరగతి ప్రజల నుంచి టిడ్కో గృహాల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో సొమ్ము వసూలు చేసింది. కొంతమంది మధ్యతరగతి ప్రజలు రూ.50 వేలు చొప్పున, మరికొందరు రూ.25 వేల చొప్పున టిడ్కో గృహాలకోసం ప్రభుత్వానికి చెల్లించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిబంధనలను పూర్తిగా మార్చింది. రూపాయి తీసుకుని పేదలకు ఇళ్లు కేటాయించాలని నిర్ణయించింది. టిడిపి ప్రభుత్వం హయాంలో చెల్లించిన సొమ్ములు ఏమయ్యాయో తెలియని అయోమయంలో లబ్ధిదారులున్నారు. ఆ డబ్బులు తిరిగి ఇస్తామని అధికారులు చెపుతున్నా నాలుగేళ్లుగా అది జరగడం లేదు. ఈ నేపథ్యంలో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ లేఅవుట్లలో ప్లాట్ల కోసం చెల్లింపు చేస్తే తమ డబ్బులకు గ్యారెంటీ ఉంటుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డ్రాపౌట్లు ఉండకూడదు

- పిల్లలందరినీ బడిలో చేర్చాల్సిందే
- విద్యాకానుక కిట్లు సక్రమ పంపిణీకి చర్యలు
- రీ సర్వే, నాడు - నేడు పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-బాడంగి, రామభద్రపురం

బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరాల్సిందేనని, డ్రాపౌట్లు అస్సలు ఉండకూడదని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. 2005-2018 మధ్య పుట్టిన పిల్లలందరూ ఖచ్చితంగా విద్యా సంస్థల్లో ఉండాలని, దీనికోసం ఇంటింటి సర్వే నిర్వహించి, వారు చదువు కొనసాగించేలా కృషి చేయాలని సూచించారు. నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేసి, పాఠశాలలను పున్ణప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బుధవారం బాడంగి, రామభద్రాపురం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, సచివాలయాలను తనిఖీ చేశారు.

బాడంగి మండలం కామన్నవలస గ్రామం మంగళిబంద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు ప్రారంభం అయ్యేలోగా పనులు ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. గొల్లాది గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. నిర్మాణం లో ఉన్న సచివాలయం భవనాన్ని త్వరగా పూర్తి చేసి, దానిలోకి తరలించాలని సూచించారు. నాడు - నేడు పనులను త్వరగా పూర్తి చేసి, పాటశాలలను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని, డొంకినవలసలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, వెల్నెస్ సెంటర్ భవనాలను పరిశీలించారు. పెండింగ్ బిల్లులు వారం పదిరోజుల్లో వస్తాయని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. బాడంగి సిహెచ్‌సిని కలెక్టర్ తనిఖీ చేసి ఎవల పట్ల ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న కొత్త సిహెచ్‌సి భవనాన్ని పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడూ-నేడు పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. పిన్నవలస సచివాలయం భవనాన్ని, మరుగుదొడ్ల నిర్మాణానికి పరిశీలించి, పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. అచ్చియ్యపేట గ్రామ సరిహద్దుల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. గ్రామస్థులు తమ దృష్టికి తెచ్చిన రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరిస్తామని, విద్యుత్ స్తంభాలను వేయిస్తామని, తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పర్యటనలో జెడ్‌పిటిసి పి.రామారావు, తాహశీల్దార్ రఫీజాన్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎన్.సూర్యనారాయణ, ఇతర మండల స్థాయి అధికారులు, ఇంజనీర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రామభద్రపురం : జెడ్‌పి హైస్కూలులో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రామభద్రపురంలో....

రామభద్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో చేపట్టిన నాడూ-నేడు పనులను పాఠశాలల పున్ణప్రారంభం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యాకానుక పంపిణీకి ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖాధికారులను, ఉపాధ్యాయు లను కలెక్టర్ ఆదేశించారు. అక్కడే ఏర్పాటు చేసిన మండల స్థాయి స్టాక్ పాయింట్లో భద్రపరిచిన విద్యాకానుక కిట్లను, పుస్తకాలను, ఇతర సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. పంపిణీకి సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. పిహెచ్‌సిని తనిఖీ చేసి సేవలపై ఆరా తీశారు. నాయుడు వలస గ్రామ సచివాలయాన్ని, తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. బూశాయవలస పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పర్యటనలో ఆర్‌డిఓ పి.శేషశైలజ, డిఎల్‌డిఒ ఎస్.రవీంద్ర, తాహశీల్దార్ ఎం.రాజారావు, ఎంపిడిఒ కె.రమామణి, ఎంఇఒ తిరుమల ప్రసాద్, మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు అశోక్‌గజపతిరాజు

ఇద్దరు కార్యదర్శులపై సస్పెన్షన్

డిఎల్‌పిఒ విచారణతో వెలుగు చూసిన అక్రమాలు

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలం అంబాడ వెంకటాపురం గ్రామపంచాయతీ నిధులు అవకతవకలపై చీపురుపల్లి డిఎల్‌పిఒ మోహన్‌రావు విచారణ అనంతరం పంచాయతీ నిధులు అవకతవకలు నిర్ధారణ కావడంతో ఇద్దరు కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీ కేష్ లాఠ్కర్ ఉత్తర్వులు ఎంపిడిఒ కార్యాలయానికి పంపారు.2018- 21 ప్రత్యేక పాలనలో పంచాయతీ కార్యదర్శులుగా ఇజ్జాడ గోపి, బసవ శ్రీనివాసరావు పనిచేశారు. ఆ కాలంలో సర్పంచ్ చుక్కా వెంకట నాయుడు పనులు చేసినప్పటికీ ఆ పనులకు నిధులు చెల్లించకుండా వారి కుటుంబ సభ్యుల పేరున విత్ డ్రా చేసుకోవడంతో సర్పంచ్ విజయనగరం జిల్లా కలెక్టర్‌కు, డిపిఒలకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టగా నిధులు అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయింది. ఈనేపథ్యంలో లావేరు మండలం పనిచేస్తున్న బసవ శ్రీనివాసరావు, రేగిడిలో పనిచేస్తున్న ఇజ్జాడ గోపిలను సస్పెండ్ చేసినట్లు శ్రీకాకుళం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహానాడులో పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు పిలుపునిచ్చారు. బుధవారం అశోక్‌బంగ్లాలో టిడిపి జిల్లా విస్తత స్థాయి సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి మౌనం పాటించారు. అనంతరం అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తూ చంద్రబాబు నాయుడు మహానాడులో ప్రకటించిన హామీలను ప్రజల్లోకి ఏవిధంగా తీసుకువెళ్లాలి, వీటి వలన ప్రజలకు వచ్చే ప్రయోజనాలు ఏంటి, ప్రస్తుత ప్రభుత్వ అసమర్థత, అప్పుల పాలనను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రధానంగా మహిళల కోసం రూపొందించిన సంక్షేమాన్ని తెలపాలన్నారు. వైఎస్ జగన్ పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించి, టిడిపి అధికారంలోకి వస్తే ఎటువంటి మేలు చేస్తుందో ప్రజలకు తెలపాలని సూచించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమం ముసుగులో ప్రజలపై విపరీతమైన భారాలు వేసిందని అన్నారు. ఓవైపు పథకాల పేరిట డబ్బులు ఇచ్చి మరో చేత్తో లాగేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈనేపథ్యంలో వైసిపి వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో నూతన ప్రీ ఆడిట్ విధానం

ఆడిట్ శాఖ ఉప సంచాలకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో గతంలో ఉన్న పోస్ట్ ఆడిట్ తో పాటు ప్రీ ఆడిట్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకులు ఆర్.హరి ప్రకాష్ తెలిపారు. బుధవారం బొబ్బిలి, రాజాం, నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్లతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలు, పాలకొండ నగర పంచాయతీ కమిషనర్లతో మర్రి చెన్నారెడ్డి భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రీ ఆడిట్ విధానం వలన ఆడిట్ శాఖ సిబ్బంది సేవలు వినియోగించుకుంటూ మున్సిపాలిటీలో మరింత పారదర్శకత పెంచవచ్చునని అన్నారు. ప్రీ ఆడిట్ వల్ల బిల్లులు పాస్ చేసే సందర్భంలో సమయాభావం లేకుండా సిబ్బందికి తగు శిక్షణ, సూచనలు ఇస్తామని తెలిపారు. ఈ విధానం ఇప్పటికే దేవదాయ శాఖలో అమలు చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ఉన్నత విద్యాశాఖ, స్థానిక సంస్థల్లో ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో రీజనల్ డైరెక్టర్ డి.అరుణ్‌కుమార్, మన్యం జిల్లా జిల్లా ఆడిట్ అధికారి కె.జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆడిట్‌శాఖ ఉప సంచాలకులు హరిప్రకాష్

బ్లాక్‌లో పెట్టిన ఖాళీలన్నీ ఓపెన్ చేయాలి

డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ బదిలీల్లో బ్లాక్ లో పెట్టిన పోస్టుల ఖాళీలను ఓపెన్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యాన జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌జిటి బదిలీలకు సంబంధించి ఏజన్సీ ప్రాంతంలోని తప్పనిసరి బదిలీలకు గురయ్యేవారు 31 మంది ఉంటే 125 ఏజెన్సీ ఖాళీలు చూపించారని తెలిపారు. మైదాన ప్రాంతం లో తప్పనిసరి బదిలీ అయ్యేవారు 1194 మంది ఉంటే 1138 మైదాన ప్రాంత ఖాళీలు చూపించారని తెలిపారు. మొత్తంగా 1225 మంది తప్పనిసరి బదిలీలు అయ్యేవారు ఉంటే ఏజన్సీ, మైదానం ప్రాంతం కలిపి 1263 ఖాళీలు చూపించారని, ఏజన్సీ ప్రాంతం వారికి ఏవిధంగా ఖాళీలు చూపించారో మైదానం ప్రాంతంలో కూడా అన్ని ఖాళీలు చూపించాలని డిమాండ్ చేశారు. బ్లాక్‌లో పెట్టిన పోస్టుల ఖాళీలు చూపించడం ద్వారా ఉపాధ్యాయుల బదిలీలకు మెరుగైన అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం డిఇఒ లింగేశ్వర రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ధర్నా లో యుటిఎఫ్ నాయకులు కె.శ్రీనివాసరావు, రామకృష్ణ, రాజారావు, ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ మేయర్ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర డిప్యూటీ మేయర్ -1 ఎన్నిక గురువారం జరగనుంది. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఎన్నికకు సంబంధించి కార్పొరేటర్లు అందరికీ సమాచారాన్ని నగర పాలక సంస్థ అధికారులు అందించారు. 50 మంది కార్పొరేటర్లలో 49 మంది సంఖ్యాబలం ఉన్న వైసిపి నుంచి డిప్యూటీ మేయర్ ఎవరన్నది ఉత్కంఠగా మారింది. డిప్యూటీ మేయర్ 1 పదవికి ఇసరపు రేవతీదేవి ఏప్రిల్ 21న రాజీనామా చేశారు. అయితే ఆ పదవిని ఎవరికి కట్టబెడతారనే చర్చ వైసిపి నాయకుల్లో జరుగుతోంది. అధికారం యావత్తు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతులోనే ఉన్నప్పటికీ కార్పొరేటర్ పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. బయటకి ఎవరి పేరూ ప్రకటించక పోయినా డిప్యూటీ మేయర్ పదవి అనేది ఖచ్చితంగా యాదవ్ కులస్తులకే ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఆ కులానికే కేటాయించడం వెనుక గల లెక్కల్లో రాజకీయం ముడిపడి ఉంది. తొలుత ఆ సామాజిక వర్గానికి చెందిన ముచ్చు నాగలక్ష్మికి డిప్యూటీ మేయర్ పదవి వరించింది. ఆమె అకాల మరణంతో ఖాళీ అయిన కుర్చీ అదే సామాజిక వర్గానికి చెందిన రేవతీ దేవీకి కట్టబెట్టారు. ఇప్పుడు ఆమె రాజీనామా చేయడంతో ఆ సీటు కోసం సీనియర్ నాయకులు ఆశపడినా యాదవ కులస్తులకే కేటాయిస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ మేయర్ రేసులో నిలిచిన వాళ్లలో మచ్చు నాగలక్ష్మి కుమార్తె లయ, ఏడవ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి ఉన్నారు. వాస్తవానికి రాజీనామా చేసిన రేవతీ దేవీగానీ, ఆ పదవి కోసం తెరమీదకి వచ్చిన లయగానీ, మాలతి గానీ వీళ్ల కుటుంబీకులంతా వీరభద్రస్వామికి ముఖ్య అనుచరులు. అయినా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తునే ఉన్నారు. అయితే నాగలక్ష్మి కుమార్తె లయకే పదవి ఇస్తారని తెలిసింది.

జిపిఎస్ అంటే ఉద్యోగులను మోసం చేయడమే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిపిఎస్ అంటే ఉద్యోగులను మోసం చేయడమేనని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు,ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో ప్రధానంగా సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను ప్రవేశపెట్టడం, 12వ పిఆర్‌సి కమిటీ నియామకం వంటి నిర్ణయాలు ప్రకటించడానికి ఎస్‌టియు ఖండిస్తోందని తెలిపారు. సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మాటమార్చి జిపిఎస్ అమలుకు నిర్ణయం తీసుకోవడం ఉద్యోగుల్ని మోసం చేయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ అనేది పాత పెన్షన్ విధానానికి ప్రత్యామ్నాయమైతే కాదని తెలిపారు.

11వ పిఆర్‌సిలో ఎంతగానో ఉద్యోగులకు నష్టం కలిగించిన రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు ద్వారా మరోసారి ఉద్యోగులను మభ్య పెట్టే కార్యక్రమం చేపట్టిందని పేర్కొఆన్నరు. మిగతా సంఘాలతో చర్చించి భవిష్యత్తు ప్రణాళికను ప్రకటిస్తామని తెలిపారు.

దారి దోపిడీ కేసులో డ్రైవరే సూత్రధారి

- నలుగురు నిందితులు అరెస్టు
- రూ 4.70 లక్షలు స్వాధీనం
- రూ. 45 లక్షలతో తప్పించుకు తిరుగుతున్న మరో నిందితుడు
- త్వరలో పట్టుకుంటాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారం వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారిపై గత నెల 30వ తేది అర్ధరాత్రి కారును అడ్డగించి దారిదోపిడీ చేసి రూ. 50 లక్షలు అపహరించిన దుండగులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం నుండి విశాఖ పట్నం రెండు బైక్ లపై వెళ్తుండగా వీరిని మండలంలోని కందివలస గెడ్డ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ. 4.70 లక్షలతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మిగతా రూ. 45 లక్షలు మరో నేరస్తుడు వద్ద ఉన్నట్లు పట్టుబడ్డ నిందితులు పోలీసులకు చెప్పారు. ఆయన కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న నలుగురు నిందితులను బుధవారం కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి గోవిందరావు స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన కోట్ల వంశీకృష్ణ ధాన్యం, అపరాలు స్థానికంగా కొనుగోలు చేసి కాకినాడలో వ్యాపారికి అమ్మకం చేస్తుంటారు. విశాఖపట్నంకు చెందిన వరదరాజు అనే బ్రోకర్ ద్వారా లావాదేవీలు చేస్తుంటారు. ఎప్పటి లాగే అమ్మకం చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును తీసుకొచ్చేందుకు గత నెల 30న వంశీకృష్ణ పర్లాకిమిడి నుండి విశాఖపట్నం బయలుదేరాడు. కారు నడిపేందుకు తనకు తెలిసిన జయరాం అనే డ్రైవర్‌తో కలిసి విశాఖ వచ్చారు. తరుచుగా వంశీకృష్ణ విశాఖపట్నం వస్తున్నప్పుడు జయరాంను డ్రైవర్‌గా తీసుకువస్తుంటాడు. జయరాం పర్లాకిమి డిలో ఆటో నడుపుతూ ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నాడు. తాను తరచూ విశాఖపట్నం నుండి లక్షలు రూపాయలు నగదును వంశీకృష్ణ అనే వ్యాపారితో కలిసి కారులో తీసుకొస్తుంటానని తన స్నేహితుడు మధు అనే మరో ఆటో డ్రైవర్‌కు జయరాం చెప్పాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడాలంటే ఈ సారి నగదుతో వస్తున్నప్పుడు ఎలాగైనా అపహరించాలని పథం వేసారు. వారితో పాటు మరో ముగ్గురు పర్లాకిమిడికి చెందిన ఆటో డ్రైవర్లు సంతోష్ పట్నాయక్, కుమారస్వామి, చింతాడ నరేంద్రను దోపిడీకి కుదుర్చుకున్నారు. గత నెల 30న డ్రైవర్ జయరాంకు వంశీకృష్ణ నుండి ఫోన్ వచ్చింది. విశాఖ వెల్లి నగదు తీసుకువద్దామన్నాడు. వెంటనే విషయం జయరాం తన స్నేహితులకు తెలిపాడు. కారు వెనుక పర్లా కిమిడి నుండి రెండు బైక్‌లపై మధుతో పాటు మరో ముగ్గురు విశాఖపట్నం వచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో రూ. 50 లక్షలు పట్టుకొని విశాఖ నుండి పర్లా కిమిడికి బయలు దేరారు. ఈ విషయాన్ని డ్రైవర్ జయరాం తన గ్యాంగ్‌కు చెప్పాడు. తాము నాతవలస టోల్ గేటు వద్ద రాత్రి 12 గంటల సమయంలో టీ తాగేందుకు కారు ఆపుతామని చెప్పాడు. అక్కడి నుంచి బయలు దేరిన తరువాత ఎక్కడ చీకటి ఉంటే అక్కడ కారుకు అడ్డంగా వచ్చేయాలని చెప్పాడు. చెప్పినట్లే రాత్రి 12 గంటల సమయంలో నాతవలస టోల్ గేటు వద్ద టీ తాగారు. అనంతరం బయలుదేరి వెళుండగా చోడమ్మ అగ్రహారం బ్రిడ్జిపై కారుకు అడ్డంగా బైక్‌లు పెట్టి కారు ఆపారు. యజమాని వంశీకృష్ణ కారు అద్దాలు తీయవద్దని చెప్పినా డ్రైవర్ జయరాం అద్దాలు దించేసాడు. వెంటనే వారు కారులో చెయ్యిపెట్టి రూ. 50 లక్షలు బ్యాగును ఎత్తుకుపోయారు. కొంత సేపు అటు ఇటూ తిరిగి వంశీకృష్ణతో పాటు డ్రైవర్ జయరాం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసు బృందాలు రంగంలో దిగాయి. డ్రైవర్ ప్రవర్తనపై అనుమానం రావడంతో సెల్ కాల్స్ పరిశీలించారు. డ్రైవర్ తో పాటు నలుగురు దుండగలు ఫోన్ సంభాషణలను బట్టి కేసును చేధించగలిగారు. రూ. 50 లక్షలు దోపిడీ చేసిన వీరు నలుగురు వెంటనే విజయనగరం చేరుకున్నారు. అక్కడ మధు అనే వ్యక్తి ముగ్గురికి రూ. 5 లక్షలు ఇచ్చి పర్లాకిమిడి వెళ్లిపోమన్నాడు. వారంతా బైక్ పై రూ.5లక్షలు పట్టుకొని పర్లా కిమిడి వెళ్లిపోయారు. పూసపాటి రేగ పోలీసులకి ఫిర్యాదు ఇచ్చిన కొంత టైం లోనే డ్రైవర్ కూడా పోలీసుల నుండి తప్పించుకున్నాడు. నేరస్తులంతా పర్లా కిమిడిలో కలుసుకొని పోలీసులు తమ గ్రామాల్లో విచారణ చేస్తున్నారని రెండు బైక్‌లపై విజయవాడ వెళ్లేందుకు ప్రయాణమయ్యారు. బుధవారం ఉదయం కందివలస గెడ్డ వద్ద వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుండి రూ. 4.70 లక్షలు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైక్ లు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు మధు కోసం గాలిస్తున్నారు. మిగతా రూ. 45 లక్షలు మధు దగ్గర ఉందని, త్వరలో అతడిని పట్టుకుంటామని డిఎస్‌పి తెలిపారు. కేసు ఛేదనలో సిసిఎస్ సిఐ ఎం. బుచ్చిరాజు, విజయనగరం టూ టౌన్ సిఐ సిహెచ్ లక్ష్మణరావు ప్రత్యేక చొరవ చూపించారన్నారు. పూసపాటిరేగ ఎస్‌ఐ ఎ.నరేష్, సిసిఎస్ ఎస్‌ఐ సాగర్ బాబు, క్రైమ్ కానిస్టేబుల్ దామోదర్ తదితరులు కీలకంగా వ్యవహరించారని తెలిపారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

మండలానికి చేరిన వరి విత్తనాలు

ప్రజాశక్తి - వేపాడ

ఈ ఏడాది ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు మండల కేంద్రానికి చేరుకున్నాయని వ్యవసాయాధికారి యశ్వంత్ కుమార్ అన్నారు. 1791 క్వింటాల వరి విత్తనాలు అవసరం కాగా 1431 క్వింటాలు అందుబాటులో ఉన్నాయన్నారు. యుఎంటియు 1121 రకం 30 కేజీలు రూ. 1134 సబ్సిడీ పోగా రైతుకు రూ. 834కి అందిస్తామన్నారు. బిపిటి 5204 రకం 25 కేజీలు రూ. 947 కాగా సబ్సిడీ పోగా రైతుకు రూ. 697 చెల్లిస్తే సరిపోతుందన్నారు. పిపిటి 3291 సాంబ 30 కేజీలు రూ. 1119 కాగా రూ.819 చెల్లించాల్సిందిగా. ఎంటియు 7029 స్వర్ణ 30 కేజీలు రూ. 1143 కాగా రూ. 843 చెల్లిస్తే రైతులకు ఇస్తామని చెప్పారు.

సచివాలయ సిబ్బంది పనితీరు భేష్

ప్రజాశక్తి - వేపాడ

సచివాలయం సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని ఎంపిడిఒ పట్నాయక్ ప్రశంసించారు. మండలంలోని పాటూరు సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి చెందారు. జగనన్న కాలనీ ఇళ్లపై వాలంటీర్లకు ఆరా తీసి త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం, వెల్నెస్, ఆర్‌బికె కేంద్ర భవనాలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్త నుండి సంపద కేంద్రంను సద్వినియోగం చేయాలన్నారు. అమ్మఒడి, చేయూత, ఈబిసీ నేస్తం వంటి ప్రభుత్వ పథకాల రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాలంటీర్ల హాజరు రిజిస్టర్‌ను కూడా పరిశీలించారు. గ్రామంలో గల ఇంటింటి కొళాయిల సంఖ్యను పంచాయతీ కార్యదర్శి సంధ్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 480 కొళాయి కనెక్షన్లు ఉండగా 40వేల లీటర్ల కెపాసిటీ గల రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందని సంధ్య వివరించారు. రైతు భరోసా లబ్ధిదారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బందితో పథకాల చేరువేతపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాకు జీతాలివ్వండి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని గూడెం పిఎసిఎస్‌లో గత ఖరీఫ్ ధాన్యం కొనుగోల్లో కీలక పాత్ర వహించిన టిఎలకు ఇంతవరకు జీతాలు ఇవ్వలేదని ఆందోళన చెందుతున్నారు. తమకు వెంటనే జీతాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని నాలుగు పిఎసిఎస్‌లు ఉండగా కెల్ల, జమ్ము పేట, తెట్టంగి సొసైటీలలో పనిచేసిన వారికి ఆయా సొసైటీలు జీతాలు చెల్లించాయి. గూడెం సొసైటీలో పనిచేసిన వారికి మాత్రం ఇంతవరకు జీతాలు ఇవ్వలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - గుర్ల

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ ఓ. భాస్కరరావు అన్నారు. బుధవారం ఆయన గుర్ల పిహెచ్‌సి పరిధిలో కోటగండ్రేడు ఆరోగ్య కేంద్రాన్ని, తెట్టంగి పిహెచ్‌సి పరిధిలో పెనుబర్తి ఆరోగ్య కేంద్రాన్ని, గుర్ల పిహెచ్‌సిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలను భాగస్వాములుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షర్మిల, డాక్టర్ చెన్న, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - బొండపల్లి

మండలంలోని బొండపల్లి, గెద్దపేట, గొల్లుపాలెం గ్రామాలలోని అంగన్వాడి కేంద్రాలను గంట్యాడ సిడిపిఒ ఉమాభారతి బుధవారం పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాలలో జరుగుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి అంగన్వాడి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. నాడు నేడు పథకంలో భాగంగా నిర్మాణంలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈమె వెంట పర్యవేక్షకురాలు జి.ప్రమీల దేవి సాకేంతిక సహాయకురాలు భారతి ఉన్నారు.

రెగ్యులర్ చేయడం హర్షణీయం

ప్రజాశక్తి - భోగాపురం

22 ఏళ్ల గా ఎదురు చూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎపిఎన్‌జిఒ భోగాపురం తాలూక అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు, కార్యదర్శి సంతోష్, అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ పిఆర్‌సి అమలుకు కమిటీ ఏర్పాటు చేయడానికి మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకోవడం పట్ల కూడా హర్షం వ్యక్తం చేశారు. జనవరి 2022 నుండి డిఎ మంజూరుకు ప్రభుత్వం అంగీకరించడం ఆనందదాయకమన్నారు.

చెరువు ఆక్రమణపై వినతి

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని కోటి చెరువు, నియోజకవర్గంలోని పలు చెరువులును అధికార పార్టీ నాయకులు కబ్జాలు చేస్తున్నారని జనసేన కార్యదర్శి బాబు పాలూరి ఆరోపించారు. ఈ మేరకు చెరువుల కబ్జాలకు సంబంధించిన పూర్తి సమాచారం తనకు కావాలని బుధవారం సహచట్టం ద్వారా తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువుల కబ్జాపై జనసేన ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్, చీమల సతీష్, సత్య, కిరణ్, రాజేష్, గణేష్, పోతల శివశంకర్, రమేష్, జగన్, శివ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో వాలంటీర్ల సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని 30,31 వార్డులలో పని చేస్తున్న వార్డు వాలంటీర్లను 16వ సచివాలయంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటింటికి అందిస్తున్న వాలంటీర్లను అందరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిహెచ్ అనసూయమ్మ, వైసిపి నాయకులు వి.మనోజ్ కుమార్, రామారావు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - గజపతినగరం

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిఎస్‌డిటి డివి రవిశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని పిడిసీల గ్రామంలో రహస్య సమాచారం ప్రకారం బోడసింగిపేట గ్రామానికి చెందిన ఇంపోలు సన్యాసిరావు అనే వ్యక్తి 410 కేజీల రేషన్ బియ్యాన్ని 11 బస్తాలలో తరలించబోతుండగా ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. వీటిని గజపతినగరం ఎమ్ఎల్ఎస్ పాయింట్ వద్ద భద్రతా కారణాల దృశ్య నిల్వ చేశామన్నారు. అతనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

27న రాష్ట్ర స్థాయి యువజన సమ్మేళనం

ప్రజాశక్తి - బొబ్బిలి

ఈ నెల 27 నుండి 30 వరకు గుంటూరులో రాష్ట్రస్థాయి యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు అన్నారు. ఎఐవైఎఫ్ జిల్లా జనరల్ బాడీ సమావేశం బొబ్బిలి పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే ఆలోచన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. మంత్రివర్గ సమావేశంలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి కోట అప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగభూషణం, డివిజన్ కార్యదర్శి తులసీరామ్, మన్యం జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు

వ్యాక్సిన్ వేస్తున్న సర్పంచ్ రామునాయుడుత

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపురం సచివాలయం పరిధిలో గల చిన్న గుడిపాల గ్రామంలో సర్పంచ్ బోజంకి రాము నాయుడు ఆధ్వర్యంలో గొర్రెలకు మేకలకు నట్టల నివారణ, రోగ నిరోధక వ్యాక్సిన్ బుధవారం వేశారు. వారం రోజులు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి సింహాద్రి నాయుడు, స్థానిక గోపాలమిత్ర బి సింహాద్రి పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - కొత్తవలస

సబ్సిడీపై వ్యవసాయ శాఖ అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ విరోతి కొండలరావు అన్నారు. తుమ్మికాపల్లి గ్రామంలో బుధవారం ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో వ్యవసాయశాఖ అందిస్తున్న వివిధ రకాల పథకాలు, సబ్సిడీ కార్యక్రమాల మీద గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మండల వ్యవసాయాధికారి మాధురి శరణ్య మాట్లాడుతూ ప్రస్తుతం కౌలు చేస్తున్న రైతులందరూ గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా సీసీఆర్‌సి - క్రాప్ కల్టివేటెడ్ రైట్ కార్డ్ తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు వ్యవసాయశాఖ నుంచి అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, రైతులకు సాయంగా అందిస్తున్న రైతు భరోసా, బ్యాంకుల నుంచి రుణాలు, పంట నష్టపరిహారం సబ్సిడీలు పొందవచ్చని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కి కావల్సిన పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలు రైతు ఆధార్ కార్డు తీసుకొని వెళ్లి స్థానిక రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకి కావల్సిన అన్ని వరి రకాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు గీత సంతోషి, వ్యవసాయ సహాయకులు స్వప్న, సిఆర్‌పి గోవింద్, ఐసిఆర్‌పిలు వెంకటలక్ష్మి, లక్ష్మి, రామలక్ష్మి, గౌరీ, రైతులు పాల్గొన్నారు.

కొత్తవలస: విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్

జామి: 2023 ఖరీఫ్ సీజన్ ముందస్తు ఏర్పాట్లలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ అధ్యక్షతన మండల పరిషత్ ప్రాంగణంలో జరిగిన సదస్సుకు అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, భూసార పరీక్ష ప్రాముఖ్యత, విధానం, వాటి వల్ల రైతు పొందే లాభాలు వివరించారు. పచ్చి రొట్ట ఎరువులు 50శాతం రాయితీ పై ఆర్‌బికెలలో సరఫరా చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. నేల సారవంతం చేసి ఎరువులపై పెట్టే మధుపు తగ్గించుకోవాలన్నారు. నవధాన్యాలు సాగు - నేల తల్లికి బాగు అంటూ, 2400 కిట్స్ లక్ష్యంగా ఇచ్చామన్నారు. వరి విత్తనాలు కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మండలానికి అవసరమైన 2160 క్వింటాళ్లు ఆర్‌బికెల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా, డిఎపి, ఎరువులను ముందు జాగ్రతగా నిలవ చేశామన్నారు. ఈ సంవత్సరం ఇపంట తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఇపంటలో నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంటల భీమా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ పంట రుణాలు, ధాన్యం కొనుగోలకు రైతు అర్హత పొందుతారన్నారు. కౌలు రైతులు అందరికి భూమి యజమానితో సమానంగా అన్ని ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారికి దరఖాస్తు చేసుకుంటే సిసిఆర్‌సి కార్డులు పొందవచ్చు అన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాం క్లస్టర్‌లో గల కరకవలస, దబ్బిరాజుపేట గ్రామాల రైతులకు సుస్థిర వ్యవసాయం సాగుపై వ్యవసాయ అధికారి యశ్వంత్ కుమార్ అవగాహన కల్పించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులు ముందుగా పిఎమ్‌డిఎస్ నవ ధాన్యాలు వేయడం వల్ల నేల సారవంతం పెరిగి వేసే పంటలు అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. వరి పంటకు ముందు పెసలు, మినుములు, కందులు, రాగులు, జీలుగా, కూరగాయలు వంటి పంటలు వేయాలన్నారు. 45 రోజులు తర్వాత నేలను దున్నడం వల్ల నేలలో ఉన్న క్రిములు నాశనమై నేల గొల్లబారి సారవంతంగా తయారవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ కోఆర్డినేటర్ పి వెంకట్రావు, విఒఎలు పాల్గొన్నారు.

బొండపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

బొండపల్లి: మండలంలో గరుడుబిల్లి రైతు భరోసా కేంద్రంలో బుదవారం ఎఒ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు అందిస్తున్న సేవల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న కౌలు కార్డులు, పచ్చి రొట్ట, నవదాన్యాల సాగు, వ్యవసాయ యాంత్రీకరణ, సున్నా వడ్డీ పంట రుణాలపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటకు ముందుగా అదనపు ఆదాయం కోసం చిరు ధాన్యల సాగు చేపట్టాలని సూచించారు. ఉద్యానధికారి ఎ రాజశేఖర్ మాట్లాడుతూ మామిడి తోటల్లో కొమ్మల కత్తిరింపు, ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట ఎరువుల అవశ్యకత, ఖరీఫ్ సీజన్లో వరి గట్లపై తీగ జాతి కూరగాయలు పెంపకం వల్ల ఎకరానికి పదిహేను వేల రూపాయలు అదనపు ఆదాయం రైతులు పొందవచ్చునని తెలిపారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు, అర్హులైన రైతులుకు కవులు రైతు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బొద్దల చిన్నంనాయుడు, లెంక అప్పారావు, వ్యవసాయ విస్తరణధికారి సంతోష్, గ్రామ వ్యవసాయ సహాయకులు మామిడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కాగ్ రిపోర్ట్ చూసి కేంద్రం కళ్లు తెరవాలి

ప్రజాశక్తి - జామి

ప్రపంచంలో అతిపెద్ద రైల్వే వ్యవస్థలో ఒక్కటైన భారతీయ రైల్వేలో తరచూ ఎందుకు ప్రమాదాలు జరుగుతున్నాయో వివరాలతో కాగ్ విడుదల చేసిన 2022 (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) రిపోర్టుని కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అర్థం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాగ్ నివేదిక ప్రకారం 2017 నుండి 2021 వరకూ నాలుగేళ్ళలో 1129 రైల్వే ప్రమాదాలు దేశంలో చోటు చేసుకున్నాయన్నారు. వీటిల్లో 156 ప్రమాదాలు సరియైన సమయానికి మెయింటెనెన్సు లేక జరిగాయని, ఇందులో 182 ప్రమాదాలు రైల్వే మెకానికల్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం కారణంగా జరిగాయని, ఓవర్ స్పీడ్ కారణంగా 154 ప్రమాదాలు జరిగాయని, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం కారణంగా 400 ప్రమాదాలు జరిగాయని చెప్పారు. ఇన్ని పొరపాట్లు జరుగుతున్నా కేంద్ర రైల్వే శాఖ అధికారులు ఎటువంటి విచారణ చేపట్టలేదని కాగ్ తప్పు పట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖకి 2017 నుండి 2021 వరకూ భద్రతా నిధి పేరుతో 20 వేల కోట్ల రూపాయలు ఇవ్వవలసి ఉండగా రూ.15,770 కోట్లు మాత్రమే ఇచ్చి ఇందులో ఏడాదికి 2,300 కోట్ల రూపాయలు నిధులు మళ్లించారని కాగ్ ఆరోపించిందని భీశెట్టి అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖని సేవారంగం నుండి తప్పించి వ్యాపార రంగంగా మార్చివేసిందని, అన్ని విభాగాలను ప్రైవేటు పరం చేస్తూ రైల్వే శాఖ ఉద్యోగుల్లో అసంతృప్తి పెంచారన్నారు. కీలకమైన ఇంటర్ లాకింగ్, రైల్వే ట్రాక్ నిర్వహణ కూడా ప్రైవేట్ చేసారని, దేశ వ్యాప్తంగా 3 లక్షల మంది కేవలం సేఫ్టీ సిబ్బంది అవసరం ఉంటే 35 వేలమంది మాత్రమే రైల్వే శాఖలో పనిచేస్తున్నారని అన్నారు. ఒడిశా రైలు ప్రమాదం ఘటన తరువాత భారత రైల్వే భద్రతపై ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారని, కరోనా తరువాత దేశ వ్యాప్తంగా రైల్వేలో సీనియర్ సిటిజన్లకు ఎటువంటి రాయితీలు లేకుండా కోత కోసిన తీరుపై మండిపడ్డారు. స్టేషన్లు ఆధునీకరణ కంటే, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు పెంచే ప్రయత్నం రైల్వే అధికారులు చెయ్యాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు భీంపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

పర్యవేక్షణ ఉండాలి

విజయనగరం: గర్భం దాల్చిన నుంచే మహిళలపై పర్యవేక్షణ ఉండాలని ఐసిడిఎస్‌పీడీ శాంతకుమారి ఎఎన్ఎంలను, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. నగరంలోని 30వ సచివాలయంలో బుధవారం జరిగిన ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ గర్భం దాల్చిన నుండి ప్రసవం జరిగే వరకూ నిత్యం వారిని పర్యవేక్షించాలని, మందులు సక్రమంగా వినియోగించేటట్లు వైద్య సిబ్బంది చూడాలని అన్నారు. అంగన్వాడీ ద్వారా పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రంగా అందించి, ఐసిడిఎస్ వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి తల్లీ బిడ్డలు సురక్షితంగా ఉండేలా చూసే బాధ్యత ఆశ, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలపై ఉందని అన్నారు. హైరిస్క్ ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సిడిపిఒ ఒకటి, రెండవ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు గర్భిణీలకు బాలింతలకు అంది స్తున్న ఆహారం నాణ్యమైందిగా ఉండాలన్నారు.

డిబేట్ ఆన్ జి-20

విజయనగరం టౌన్: జి-20 కార్యక్రమాలలో భాగంగా పూణేలో జరగబోవు విద్యకు సంభందించి వర్కింగ్ గ్రూప్ సమావేశం సందర్భంగా స్థానిక కేంద్రీయ విద్యాలయంలో బుధవారం జి-20 అనే అంశం మీద విద్యార్థులకు డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. వివిధ తరగతుల విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పోటీలో పాల్గొన్నారని ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ అన్నారు. బుధవారం వరుసగా 2వ రోజు మొయిద సచివాలయం పరిధిలో మొయిద, నారాయణ పట్నం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పివి వి సూర్య నారాయణ రాజు గ్రామ వీధుల్లో పర్యటించి సంక్షేమ పథకాలు అమలు తీరును లబ్ధిదార్లను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా గ్రామ సచివాలయం వ్యవస్థను తీసుకు వచ్చి ప్రజలకు నేరుగా ప్రభుత్వం నుంచి సేవలు అందుతున్నాయని, రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించడమే కాకుండా సాగుపై సలహాలు సూచనలు, పంట కనుగోలు వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కాగా మెరుగైన వైద్య సేవలు అందించడానికి వెల్ నెస్ సెంటర్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి సేవలు ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నెల్లిమర్ల నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, మొయిద ఎంపిటిసి పెనుమత్స సంతోష్ బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

30శాతం రాయితీ పై వరి విత్తనాలు

మొయిద రైతు భరోసా కేంద్రంలో ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చేతుల మీదుగా వరి విత్తనాలు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఒ పూర్ణిమ మాట్లాడుతూ మండలానికి 1030 క్వింటాళ్ల వరి విత్తనాలు కేటాయించామన్నారు. 30శాతం రాయితీతో విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపణీ చేస్తున్నామన్నారు. విత్తనాల కోసం భరోసా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం

వడగళ్ల వాన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ ఎత్తున వర్షం కురిసింది. ఈదురుగాలులు, వడగల్లతో వర్షం పడటంతో ప్రజలు ఎండల నుంచి ఉపసమనం పొందారు. అయితే ఒకేసారి పెద్ద ఎత్తున గాలులు వీయడం వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో మండలంలోని పలు గ్రామాలు అందకారంలోకి వెళ్లిపోయాయి.

భూలోకమాంబ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక ఎస్‌సి కాలనీ సంతమార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన భూలోకమాంబ ఆలయ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులతో పాటు టిడిపి నాయకులు, గ్రామ పెద్దలు సమక్షంలో విగ్రహం, విమాన శిఖర, ధ్వజస్తంభం ప్రతిష్ట చేశారు. ఈ మేరకు భూలోకమాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కోళ్ల దంపతులను ఆలయ వేద పండితులు ఆశ్వీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్మాణ కమిటీ సభ్యులకు కోళ్ల దంపతులు ఈ సందర్భంగా రూ. 10వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ బిసి సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు మాస్టర్, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), టిడిపి విశాఖ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శులు కొరుపోలు అప్పారావు, కొత్తవలస మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ, టిడిపి రాష్ట్ర అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రూ.పదివేలు విరాళాన్ని అందిస్తున్న కోళ్ల దంపతులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరికి వెళ్లే రహదారిలో విశ్వబ్రాహ్మణ, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బుధవారం నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే కోళ్ల దంపతులు వేరువేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోళ్ల లలిత కుమారి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు రూ.10 వేలు విరాళం అందించారు. అనంతరం కోళ్ల దంపతులను ఆలయ వేద పండితులు ఆశ్వీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, నాయకులు బీశెట్టి అరుణ, పెదగాడ లక్ష్మి, గొడుపు నాగమణి, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, టిడిపి విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాపుగంటి శ్రీనివాసరావు, పెదగాడ రాజు, గొడుపు బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆపాలి

రేగిడి: మండలంలోని గుల్లపాడు పంచాయతీ పరిధి ఉంగరాడ మెట్ట వద్ద సర్వేనెంబర్ 5లో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు గురవుతున్నాయని అందుకు అధికారులు స్పందించాలని వండాన పేట, కొండల మామిడి వలస గ్రామస్తులు జమ్మల దుర్గారావు, గుండాల శివ, రేగిడి నవీన్ తదితరులు బుధవారం తహశీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉంగరాడ మెట్ట వద్ద కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకులు ఆక్రమణ చేస్తున్నారని వాటిని స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుల్లపాడు పంచాయతీ పరిధిలో మూడు గ్రామాలకు సంబంధించి గూడు లేని నిరుపేదలు ఉన్నారని వారికి ఇళ్ల స్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గత రెండేళ్ల నుంచి అధికార పార్టీ నాయకులు ఈ స్థలంపై జెసిపితో చదును చేసి అమ్మకాలు చేపడుతున్నారని మాజీ మంత్రి కోండ్రు మురళీ లిఖిత పూర్వకంగా డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.

టిడిపి మేనిఫెస్టోతో వైసిపిలో గుబులు

గంట్యాడ : టిడిపి అధ్యక్షులు చంద్రబాబు మహానాడులో ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోతో వైసిపిలో గుబులు మొదలైందని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైకాపా పాలనలో ఇసుక దందా భారీ స్థాయిలో కొనసాగుతోందన్నారు. విద్యుత్ చార్జీలు పలుసార్లు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. టిడిపిని అధికారంలోనికి తీసుకొన వచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడుగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, నాయకులు రంధి చిన్న రామనాయుడు, అల్లు విజయ్ కుమార్, బూడి గాంధీ, వేమలి చైతన్య బాబు, రంగలే కృష్ణ, పెద్దిరెడ్డి సత్యనారాయణ వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.త

అవాస్తవాలపై విచారణ విడ్డూరం

ప్రజాశక్తి - భోగాపురం

కనీసం స్పందనలో ఇచ్చిన ధరఖాస్తులను కూడా పరిశీలించకుండా అధికారులు విచారణకు రావడం విడ్డూరంగా ఉందని ఎ రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి మండిపడ్డారు. ఆయన ఆ గ్రామంలో సుమారు 10,600 ఎకరాలు కబ్జా చేసినట్లు అదే పంచాయతీలోని చిన్నిపేట గ్రామానికి చెందిన పోతల సూరి ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు బుధవారం క్షేత్ర స్థాయిలో విచారణకు వచ్చారు. అయితే ఒక గ్రామంలో 10వేల ఎకరాలు భూములుంటాయా? అని విచారణకు వచ్చిన అధికారులను శివారెడ్డి ప్రశ్నించారు. మతి స్థిమితంలేని ఒక వ్యక్తి ఫిర్యాదు చేస్తే కనీసం నిజ నిర్ధారణ కూడా చేసుకోకుండా విచారణకు ఎలా వస్తారని మండిపడ్డారు. ఒక పంచాయతీలో సుమారు 1000 నుంచి 1500 ఎకరాలు భూములుండటమే కష్టంగా ఉన్న చిన్న చిన్న గ్రామాల్లో ఒకే దగ్గర ఒకే గ్రామంలో ఒకే వ్యక్తి పదివేలు ఎకరాలకు పైగా కబ్జా చేశాడని ఫిర్యాదు చేస్తే ఎలా నమ్మి విచారణకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలే కానీ కనీసం ఏం ఫిర్యాదు వచ్చిందో చదవకుండా పరిష్కారానికి రావడం సిగ్గుచేటన్నారు. అధికారులు కూడా జాగ్రత్తగా పరిశీలించిన తరువాతే క్షేత్ర స్థాయిలో విచారణకు రావాలని ఇలా పూర్తిగా వివరాలు తెలుసుకోకుండా వచ్చి ఇబ్బందులకు గురిచేస్తే ప్రజలకు స్పందనపై ఉన్న నమ్మకం పోతుందని చెప్పారు.



వివరాలను వెల్లడిస్తున్న శివారెడ్డి

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు

కళాశాలలో తరగతులు ప్రారంభం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయని హెచ్‌ఎం బి. లక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలోనే అమ్మాయిల కోసం గతేడాది నుంచి ఇంటర్మీడియట్ కోర్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాలను నిరోదించడం, బాలికా అక్షరాస్యతను పెంచడం, బాలికలలో డ్రాప్ అవుట్‌లను నివారించడం కోసం ఉమ్మడి విజయనగరం జిల్లాలో మంజూరు చేసిన ఒకే ఒక్క బాలికా జూనియర్ కళాశాల ఇది అని చెప్పారు. కళాశాలలో బోధన కోసం ఆరుగురు పిజిటి అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, పిజిటి అధ్యాపకులు కలిసి వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, బాలికలను కళాశాలలో చేర్పించారన్నారు.

పండ్ల తోటల పెంపకానికి రైతుల ఎంపిక

ప్రజాశక్తి - రేగిడి

గ్రామ పంచాయతీల్లో పండ్ల తోటల పెంపకానికి చిన్న, సన్న కారు రైతులను ఎంపిక చేసి వారి అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపిడిఒ బాసూరు శంకరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఉపాధి కార్యాలయంలో ఉపాధి కార్యాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 39 గ్రామ పంచాయతీలో ఐదు ఎకరాల లోపు చిన్న, సన్నకారు రైతుల నుంచి పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 13 ఎకరాలు పండ్ల తోటలు ఎంపిక చేశామన్నారు. ఎక్కువ మందిని పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. జాబుకార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని సూచించారు. పనుల్లో వేసవి ఎండల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 13 ఎకరాలు గుర్తించడం జరిగిందని తెలియజేశారు. క్షేత్ర సహాయకులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఎంఎంఎస్ యాప్ ద్వారా వేతన దారుల వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. హౌసింగ్‌లో 90 డేస్ సంబంధించిన వర్కులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, ఈసి రామినాయుడు, సాంకేతి సహాయకులు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే శంబంగిని కలిసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును బాడంగి ఎంపిడిఒ ఆంజనేయులు బుధవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బాడంగి నూతన ఎంపిడిఒగా ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శంబంగిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి మండల సమస్యలపై చర్చించారు. మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే శంబంగి సూచించారు.